క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఆర్టీసీ డీఎం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా నూతనంగా నియమితులైన దినేష్ గురువారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రయాణికులు, విద్యార్థులు, మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఎంవైఎఫ్ మండలాధ్యక్షుడిగా తలారి సంతోష్



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మదనన్న యూత్ ఫోర్స్ పేరిట ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఎంవైఎఫ్ నాగిరెడ్డిపేట మండలాధ్యక్షుడిగా తలారీ సంతోష్‌ను గురువారం నియమించారు. ఈ మేరకు నాగిరెడ్డిపేట మండలకేంద్రంలో సంతోష్‌కు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఎంవైఎఫ్ కమిటీల ద్వారా గ్రామాల్లో ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆశయాలను నెరవేర్చాలని ఆయన అన్నారు. యూత్ కాంగ్రెస్ ఎల్లారెడ్డి నియోజకవర్గ అధ్యక్షుడు సర్దార్ నాయక్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, మైనార్టీ మండలాధ్యక్షుడు ఇమామ్, నాయకులు సురేందర్‌గౌడ్, షాహెద్ పాషా, మురళీగౌడ్, సంగయ్య, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ రోడ్డు శుభ్రం



సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి కొత్త బస్‌స్టేషన్ ప్రహరీని ఆనుకుని రాధాకృష్ణ లాడ్జ్ వైపు రోడ్డులో చెత్త విషయమై గురువారం సాక్షిలో ప్రచురితమైన 'డంపింగ్ యార్డులా బస్టాండ్ రోడ్డు' వార్తకు మున్సిపల్ సానిటేషన్ అధికారులు స్పందించారు. రోడ్డులో మొత్తం చెత్తను ఎత్తివేయించారు. ఆపై వర్షం కురవడంతో రోడ్డు కడిగినట్టుగా మొత్తం శుభ్రమైంది. స్థానికులు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా తగ్గించాలి



ఎల్లారెడ్డి: ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా తగ్గించాలని మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్, ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పచ్చదనంలో భాగంగా మొక్కలను నాటాలని, ప్లాస్టిక్ వినియోగించవద్దని అన్నారు.

మద్యం నిషేధిస్తూ ఏకగ్రీవ తీర్మానం



రాజంపేట: పొందుర్తి గ్రామంలో మద్యం అమ్మకాలను నిషేధిస్తూ గురువారం గ్రామ వీడీసీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు గ్రామ వీడీసీ సభ్యులు తెలిపారు. ఎవరైనా గ్రామంలో మద్యం అమ్మకాలు జరిపితే రూ.2 లక్షల జరిమానా విధిస్తామని తీర్మానంలో పేర్కొన్నారు. అదే విధంగా మద్యం కొన్నవారికి రూ.20 వేల జరిమానా, పట్టించిన వారికి రూ.20 వేల బహుమానం అందిస్తామన్నారు. అక్టోబర్ 1 నుంచి ఈ నిబంధనలు వర్తిస్తామని పేర్కొన్నారు.

బూర్గుల్‌లో..



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని బూర్గుల్‌లో మద్యం విక్రయాలను నిషేధిస్తూ గురువారం గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కిరాణ దుకాణాలు, హోటళ్లలో మద్యం విక్రయాలు చేపట్టరాదని, విక్రయించినచో రూ.లక్ష జరిమానా విధించాలని తీర్మానించారు. ఈ మేరకు తీర్మాన ప్రతులను మండల అధికారులు, పోలీసులకు అందిస్తామని గ్రామస్తులు తెలిపారు.

బీటీ రోడ్డుగా మారేదెప్పుడో..?

- చందాపూర్ నుంచి కన్‌కల్ వరకు 5 కి.మీల దూరం
- రోడ్డు బాగు పడితే నాలుగు మండలాల ప్రజలకు మేలు
- అధికార యంత్రాంగం చొరవ తీసుకోవాలని కోరుతున్న స్థానిక ప్రజలు



తాడ్వాయి మండలం చందాపూర్ నుంచి కన్‌కల్‌కు వెళ్లే రోడ్డు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని చందాపూర్ నుంచి కన్‌కల్ వరకు ఉన్న మెటల్ రోడ్డు ఉంది. ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చినట్లయితే నాలుగు మండలాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ విషయమై ఎన్నో సార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలిపినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కనీసం కొత్తగా వచ్చిన ఈ ప్రభుత్వమన్నా పట్టించుకొని ఈ రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ రోడ్డును తారు రోడ్డుగా మార్చినట్లయితే తాడ్వాయి మండల ప్రజలకే కాకుండా సదాశివనగర్, గాంధారి, కామారెడ్డి మండల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. చందాపూర్, సంగోజీవాడి, కాలోజీవాడి, బ్రాహ్మణపల్లి గ్రామాల ప్రజలు కన్‌కల్, కరడ్‌పల్లి, దేమికలాన్‌తో పాటు గాంధారి మండల కేంద్రానికి వెళ్లాలంటే వయా తాడ్వాయి, సదాశినగర్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. కన్‌కల్, కరడ్‌పల్లి, దేమికలాన్ గ్రామస్తులు సదాశివనగర్ వెళ్లాలంటే తాడ్వాయి, కామారెడ్డి మీదుగా వెళ్లాల్సి వస్తుంది. ఇక్కడి ప్రజలు గాంధారిలో ఆదివారం అతిపెద్దగా జరిగే సంతకు తరచుగా వెళ్తుంటారు. ఈ రోడ్డును తార్‌రోడ్డు మార్చినట్లయితే కామారెడ్డి డిపో నుంచి నేరుగా కరడ్‌పల్లి, గాంధారి మండల కేంద్రం వరకు ఆర్టీసీ బస్సులను నడిపించవచ్చు. పలు గ్రామాల ప్రజలకు దూరభారం తగ్గడమే కాకుండా తక్కువ డబ్బులకే ప్రయాణం చేయవచ్చు. ఈ రోడ్డు పూర్తిగా అధ్వానంగా ఉండడంతో బైక్‌లు తప్ప ఏ వాహనాలు వెళ్లలేని పరిస్థితి ప్రస్తుతం ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని చందాపూర్ నుంచి కన్‌కల్ వరకు బీటీ రోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి



అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని ఈ రోడ్డును తారు రోడ్డుగా మార్చాలి. ఎన్నో సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని మా రోడ్డు సమస్యలు తీర్చాలి. ఈ రోడ్డు బాగు పడితే ఇతర గ్రామాలకే కాకుండా వ్యవసాయ పొలాల వద్దకు కూడా సులువుగా వెళ్లవచ్చు. ప్రస్తుతం ఈ రోడ్డుపై బైక్‌లు తప్ప ఇతర వాహనాలకు వెళ్లడానికి వీలుపడటం లేదు. – ముద్దు సాయిలు, చందాపూర్

దూరభారం తగ్గుతుంది



చందాపూర్ నుంచి కన్‌కల్ వరకు ఉన్న రోడ్డును బీటీ రోడ్డుగా మార్చినట్లయితే దూరభారం బాగా తగ్గుతుంది. అలాగే తక్కువ డబ్బులతో ప్రయాణించవచ్చు. కొన్ని సందర్భాలలో కరడ్‌పల్లి, గాంధారి తదితర గ్రామాలలో ఉన్న బంధువుల ఇండ్లలో జరుగుతున్న శుభకార్యాలకు వెళ్లలేకపోతున్నాం. ఈ ప్రభుత్వమైనా పట్టించుకొని ఈ రోడ్డును తారు రోడ్డుగా మార్చాలి.

– గద్దరాజు సందయ్య, చందాపూర్

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



తుజాల్‌పూర్‌లో అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు, ఫీల్డ్ ఆఫీసర్లు

బీబీపేట: ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని హిందుస్థాన్ యూనిలివర్ కంపెనీ క్లస్టర్ మేనేజర్ హిమ కుమార్ అన్నారు. గురువారం తుజాల్‌పూర్‌లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ పంట పెట్టుకుంటే అధిక లాభాలు ఉంటాయని, చెట్టుకు సబ్సిడీ, డ్రిప్ సబ్సిడీ ఉంటుందని సంవత్సరానికి ఎకరాకు రూ.4,200 ఖర్చుకు ప్రభుత్వం రైతుల అకౌంట్లో జమ చేస్తుందని అన్నారు. అలాగే మధ్యలో 4 సంవత్సరాల వరకు అంతర పంటలు పెట్టుకోవచ్చని, ఆరో సంవత్సరం తర్వాత చెట్లు పెద్దగా పెరిగి నీడ వస్తుందని.. ఆ నీడ మధ్యలో కోకో చెట్లు పెట్టుకోవచ్చని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రాజయ్య, ఫీల్డ్ ఆఫీసర్ సత్యనారాయణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న కోతుల గుంపు

- కోతుల భయంతో అర గంట పాటు వీధుల్లోకి రాని ప్రజలు



భిక్కనూరు: మండల కేంద్రంలోని పాత గ్రంథాలయం వీధిలో కోతుల మంద గురువారం స్వైర విహారం చేసింది. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో కోతులు తమ పిల్లలతో కలిసి గ్రంథాలయ సమీపంలో ఉన్న వీధుల్లో తిరుగుతూ బెంబేలెత్తించాయి. కోతులు వాటిలో అవే పొట్లాడుకోవడం.. పెద్దగా అరవడంతో ప్రజలు భయంతో బయటకు రాలేకపోయారు. అరగంట పాటు స్వైర విహారం చేసిన కోతులు పంట పొలాల వైపు వెళ్లడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై శిక్షణ



ఎల్లారెడ్డిరూరల్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి రిటర్నింగ్ అధికారుల(ఆర్వో) శిక్షణ కార్యక్రమం గురువారం ఎల్లారెడ్డి మండలంలోని మీసాన్‌పల్లి రైతు వేదికలో నిర్వహించారు. ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, గాంధారి, లింగంపేట మండలాల రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఏర్పాటు చేశారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆర్డీవో పార్థసింహారెడ్డి, డీఎల్‌పీవో సురేందర్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, గాంధారి, లింగంపేట మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

'పార్టీలకతీతంగా అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు'



లబ్ధిదారులకు మంజూరు పత్రం అందజేస్తున్న చంద్రకాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి

భిక్కనూరు: పార్టీలకతీతంగా అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డిలు అన్నారు. గురువారం రామేశ్వర్‌పల్లిలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ధ్రువీకరణ పత్రాలను అందజేసి ముగ్గులు పోసే కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ..ఇళ్లు నిర్మించుకునే వారికి వెనువెంటనే బిల్లులు బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. వేగవంతంగా ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టాలన్నారు. వీడీసీ అధ్యక్షుడు మద్ది సూర్యకాంత్‌రెడ్డి, ఎఎంసీ డైరెక్టర్ నాగార్తి రమేష్‌రెడ్డి, నేతలు వినోద్‌గౌడ్, శశికుమార్, ఏలేటి బాపురెడ్డి, నాగార్తి చిన్న భూంరెడ్డి, ధర్మస్వామి, గంగాధర్, కడారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ పాల్గొన్నారు.

పండిత్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళులు



జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో దీన్‌దయాళ్ చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న నాయకులు



దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా అంకోల్‌లో మొక్కలు నాటుతున్న బీజేపీ నేతలు



తాడ్వాయి బీజేపీ కార్యాలయంలో..



లింగంపేట బీజేపీ కార్యాలయంలో..

సాక్షి నెట్‌వర్క్: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు, మానవతావాది, రాజకీయవేత్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని జిల్లాలో పలు చోట్ల బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలు చోట్ల మొక్కలు నాటారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు చిట్ట చివరి వ్యక్తికి చేరాలనే ఉద్దేశంతో అంత్యోదయ, ఏకాత్మ మానవవాద సిద్ధాంతాన్ని పండిత్ దీనదయాళ్ రూపొందించారని కొనియాడారు. ప్రముఖ సంఘ సంస్కర్తగా, అర్థ శాస్త్రవేత్తగా ఆయన విశేష సేవలు అందించారని వివరించారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సుదర్శన హోమం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా గురువారం సుదర్శన నృసింహ హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఈవో ప్రభు హోమం జరిపించారు. కామారెడ్డి, సిరిసిల్లా జిల్లాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

ఎల్లారెడ్డి అభివృద్ధికి రూ.15 కోట్లు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ అభివృద్ధికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రూ.15 కోట్ల నిధులను మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ నాయకులు గురువారం తెలిపారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.5 కోట్లు, మున్సిపల్ విలీన గ్రామాల అభివృద్ధికి రూ.2 కోట్లు, పెద్ద చెరువు కట్ట వద్ద పార్కు నిర్మాణానికి రూ.3 కోట్లు, 12 వార్డులలో రోడ్లు ఇతర నిర్మాణ పనులకు రూ.4 కోట్లు, గాంధీ చౌక్‌లో మెయిన్ జంక్షన్ అభివృద్ధికి రూ.కోటి చొప్పున నిధులను మంజూరు చేయించినట్లు వారు తెలిపారు.

వరద బాధితులకు నిత్యావసర కిట్ల పంపిణీ



కామారెడ్డి అర్బన్: లయన్స్ ఇంటర్నేషనల్ 320–డిస్ట్రిక్ట్ గవర్నర్ అమర్‌నాథ్, 320–ఏ డిస్ట్రిక్ట్ లయన్స్‌ల సహకారంతో కామారెడ్డి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.10 లక్షల విలువైన 500 నిత్యవసర కిట్లను ఉగ్రవాయి, రాఘవాపూర్, క్యాసంపల్లి తండా, దోమకొండ, గొట్టిముక్కులకు చెందిన వరద బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ గవర్నర్లు అమర్‌నాథ్, మహేంద్రకుమార్ రెడ్డి, లయన్స్ కామారెడ్డి అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ యాదవ్, డిస్ట్రిక్ట్ చైర్మన్ ఎం.రాజన్న, మాజీ గవర్నర్ వీటీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..



నస్రుల్లాబాద్: మండలంలోని సంగం–హాజీపూర్ గ్రామాల మధ్య గల రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. రోడ్డు పనులు మధ్యలో నిలిచిపోవడంతో నడక నరకప్రాయంగా మారింది. 2 కి.మీల మేర మొరం పోసి వదిలివేయడంతో రోడ్డంతా గుంతలు పడ్డాయి. దీంతో ప్రయాణం చేయడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులకు గుంతలు ఏర్పడకపోవడంతో నిత్యం పడి గాయాలపాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ టీచర్ల ముందస్తు అరెస్టు



లింగంపేట పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీ టీచర్లు



నిజాంసాగర్: అంగన్‌వాడీ టీచర్లను గెస్ట్ హౌస్ వద్ద ఉంచిన పోలీసులు

లింగంపేట(ఎల్లారెడ్డి): చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డిమాండ్ల సాధనకు చలో సెక్రటేరియట్ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా లింగంపేట నుంచి హైదరాబాదుకు వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లను అరెస్టు చేసి లింగంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సుజాత, అంజవ్వ తదితరులున్నారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): చలో సెక్రటేరియట్‌కు వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లను బుధవారం అర్ధరాత్రి మండలంలోని బ్రాహ్మణపల్లి గేటు వద్ద స్థానిక పోలీసులు అడ్డుకున్నారు. నస్రుల్లాబాద్ మండలం నుంచి హైద్రాబాద్‌కు వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లను పోలీస్ స్టేషన్‌నకు తరలించారు. అక్కడి నుంచి మండల కేంద్రంలోని పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌కు టీచర్లను తరలించి నిర్బంధించారు.

ప్రశాంతంగా దసరా ఉత్సవాలను జరుపుకోవాలి



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ తున్కి వేణు

భిక్కనూరు: మండల కేంద్రంలో దసరా నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని భిక్కనూరు మాజీ సర్పంచ్ తున్కి వేణు అన్నారు. గురువారం భిక్కనూరు మండల కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో నిర్వహించిన దుర్గ ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రావణ దహణ కార్యక్రమం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, నేతలు లింబాద్రి, అందె మహేందర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, బోడ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూ చిత్తూల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ..



రామారెడ్డి రైతు వేదికలో..



దేవునిపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



దోమకొండలో..

సాక్షి నెట్‌వర్క్: చిత్తూ చిత్తూల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ.. బంగారు బొమ్మ దొరికేనమ్మా ఈ వాడలోనా.. రాగి బిందె తీసుక రమణీ నీళ్లకు బోతే.. రాములోరు ఎదురాయేనమ్మా ఈ వాడలోన.. అంటూ మహిళలు పాటలతో హోరెత్తించారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయా లు, గ్రామ ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను పేర్చి పా డుతూ ఆడారు. అనంతరం నీటి కుండీలు, చెరు వులు, కాలువలు, కుంటలలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



రాజంపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ఉద్యోగులు



తాడ్వాయి ఐకేపీ కార్యాలయంలో బతుకమ్మతో సిబ్బంది



కామారెడ్డిటౌన్: బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మంజీరా డిగ్రీ కాలేజీ విద్యార్థులు

సంక్షిప్తం

రోగికి రక్తదానం

కామారెడ్డి అర్బన్: సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ వైద్యశాలలో కామారెడ్డికి చెందిన ఓ రోగికి అత్యవసరంగా బి–పాజిటివ్ రక్తం అవసరం కాగా సిద్దిపేటకు చెందిన ఎస్. భానుప్రకాష్ అనే యువకుడు అక్కడి వెళ్లి రక్తదానం చేశారని ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు తెలిపారు. రక్తదాతల సమూహం ద్వారా స్పందించి రక్తదానం చేసిన భానుప్రకాష్‌ను పలువురు అభినందించారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా సత్యనారాయణ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)గా సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎంపీడీవో అనిత నిజాంసాగర్ మండలానికి బదిలీ కావడంతో ఆమె స్థానంలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా సుధాకర్



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా సుధాకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. పోచంపాడ్‌లో పనిచేస్తున్న సుధాకర్ మద్నూర్ గురుకుల పాఠశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా ఇక్కడికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించి వారి చదువుల కోసం కృషి చేస్తానని అన్నారు.

బతుకమ్మ సంబురాలకు ఆహ్వానం



భిక్కనూరు: మండల కేంద్రంలోని ఎస్వీ గార్డెన్‌లో ఈ నెల 27న బతుకమ్మ సంబురాలను నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నేత తాటిపాముల విజయకుమార్‌గౌడ్, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీరాం వెంకటేష్‌లు తెలిపారు. వారు గురువారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని కలిసి బతుకమ్మ సంబురాలకు రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బతుకమ్మలను అందంగా పేర్చిన వారికి బహుమతులను అందజేస్తామన్నారు. మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.